డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR

విలేకరులు కావలెను..
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..
సంప్రదించండి: 8121158069

| పెద్దపల్లి Peddapalli | ఆదివారం Sunday | 01 - 03 -2026 01 - 03-2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 42 Issue: 42 | పేజీలు : 08 Pages: 08 | వెల :02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|

## అంబులెన్స్ రాకపోవడంతో

ప్రాణాలు కోల్పోయిన తండ్రి.
గుండెపోటుతో కుప్పకూలిన వృద్ధుడు.
కార్గో ఆటోలో ఆసుపత్రికి తరలించిన కుమారుడు.
ట్రాఫిక్ జామ్ కారణంగా దారిమధ్యలోనే మృతి.



2

## ఏఐతో ఉద్యోగాల అంతమా?

భయాలు అతిశయోక్తి: అమెజాన్ సీఈవో.
పని స్వభావాన్ని మార్చే సాంకేతికత.
కొత్త ఉద్యోగాలకు మార్గం సుగమం.
సాంకేతిక మార్పులతో ఉపాధి రూపాంతరం.



## బాధిత కుటుంబాలకు
# సీఎం పరిహారం



సచివాలయంలో చెక్కుల పంపిణీ.
ప్రభుత్వం అండగా ఉంటుందన్న భరోసా.
తక్షణ చర్యలతో మృతదేహాల రవాణా, అంత్యక్రియల నిర్వహణ.
మదీనా బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు సహాయం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.

2

## భూదాన్ ఉద్యమం
# రోజుకో మలుపు.

పదిహేను సంవత్సరాలకుపైగా నివాసం ఉంటున్న పేదల ఇళ్ళు, గుడిసెలు ఖాళీ.
బాధితులు చేసిన నిరసన సైతం ఎలాంటి ప్రయోజనం ఇవ్వలేదు.
బాధితులకు తాము అండగా ఉన్నామని ప్రతిపక్షాలు ముందుకు.
ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్ళు కూల్చడం అమానుషమని బీఆరెస్, వామపక్షాలు విమర్శిస్తున్నాయి.



జనం వాయిస్, ఖమ్మం, ఫిబ్రవరి 28:

కొన్ని రోజులుగా ఖమ్మం శివారు వెలుగుమట్లలోని వినోభా నవోదయ కాలనీ వార్తల్లో మార్మోగుతోంది. పదిహేను సంవత్సరాలకుపైగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లు, గుడిసెలను ప్రభుత్వం భారీగా పోలీసులను మోహరించి రాత్రికి రాత్రే ఖాళీ చేయించడం సంచలనంగా మారుతోంది. అడ్డుకునేందుకు బాధితులు చేసిన నిరసన సైతం ఎలాంటి ప్రయోజనం ఇవ్వలేదు. ఈ చర్యపై అన్ని వర్గాల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడా బాధితులకు తాము అండగా ఉన్నామని ప్రతిపక్షాలు ముందుకొస్తున్నాయి.

- మిగతా 2 లో...

## లండన్ అగ్నిప్రమాదంలో మరో తెలుగు విద్యార్థి మృతి

నిజామాబాద్‌కు చెందిన సాయి శ్రీకర్ బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ.
అవయవ దానానికి కుటుంబం అంగీకారం.



2

## కూనోకు మరో 9 చీతాలు

బోట్స్వానా నుంచి మూడో దశలో రాక
దేశంలో చీతాల సంఖ్య 48కి పెరుగుదల



2

## 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'కు శ్రీకారం

- మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్త కార్యక్రమం.
- సాంకేతిక సంస్కరణలు, ఫైళ్ల క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి.
- సంక్షేమం నుంచి పారిశ్రామికాభివృద్ధి వరకు సమగ్ర కార్యాచరణ.
- సీఎం రేవంత్ రెడ్డి.

2



## మహిళా న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ అవసరం: సీతక్క

మహిళల న్యాయ వ్యవస్థలో భాగస్వామ్యం కీలకం.
భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణపై దృష్టి.
మహిళా న్యాయవాదుల కోసం ప్రభుత్వం కట్టుబాటు.

2




## జ్యోతిష్య సూచనలతో మనస్తాపం
## ఐటీ ఉద్యోగిని ఆత్మహత్య

**బెంగళూరులో విషాద ఘటన.**
**వివాహం విఫలమవుతుందన్న అంచనాతో కలత.**
**ఘటనపై పోలీసులు కేసు నమోదు.**

జనం వాయిస్, బెంగళూరు, ఫిబ్రవరి 28:



కర్ణాటక రాజధాని బెంగళూరులో విషాద ఘటన చోటుచేసుకుంది. జ్యోతిష్య సూచనలతో మనస్తాపానికి గురైన ఓ ఐటీ ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బగలగుంటే ప్రాంతంలో వెలుగులోకి వచ్చింది. 27 ఏళ్ల విద్యాజ్యోత్ నగరంలోని ఒక సాంకేతిక సంస్థలో ఉద్యోగం చేస్తూ ఇటీవల ఇంటి నుంచే పనిచేస్తోంది. కొడగు ప్రాంతానికి చెందిన యువకుడితో ఆమె ప్రేమలో ఉండగా, ఇరు కుటుంబాలు వివాహానికి అంగీకరించినట్లు తెలిసింది. పెళ్లి అనంతర జీవితం గురించి తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఆమె ఒక జ్యోతిష్కుడిని సంప్రదించింది. అయితే ఆ వివాహం సాఫల్యం పొందదని, రెండేళ్లలో విడిపోతారని అతడు అంచనా వేసినట్లు సమాచారం. దీనిని నివారించేందుకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జ్యోతిష్కుడి సలహాను పాటిస్తూ విద్యాజ్యోత్ పూజలు నిర్వహించినట్లు తెలుస్తోంది. శుక్రవారం తొమ్మిదో రోజు పూజ కోసం కుటుంబ సభ్యులు దేవాలయానికి వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసు అధికారి తెలిపారు. వ్యక్తిగత కారణాలు, మానసిక స్థితి తదితర అంశాలపై విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

# అంబులెన్స్ రాకపోవడంతో

**జనం వాయిస్, భోపాల్, ఫిబ్రవరి 28:**

మధ్యప్రదేశ్‌లో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. గుండెపోటు రావడంతో కుప్పకూలిన తన తండ్రిని రక్షించేందుకు కుమారుడు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో వృద్ధుడు దారిమధ్యలోనే మృతి చెందాడు. అంబులెన్స్‌కు ఫోన్ చేసినప్పటికీ సమయానికి చేరుకోకపోవడం ఈ విషాదానికి కారణమైంది. తండ్రికి గుండెపోటు వచ్చిన వెంటనే కుమారుడు అత్యవసర సేవలకు కాల్ చేశాడు. అయితే చాలా సేపు వేచి చూసినా అంబులెన్స్ రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. చివరకు కార్గో ఆటోను ఆపించి అందులోనే తన తండ్రిని ఎక్కించుకుని సమీప ఆసుపత్రికి తరలించేందుకు బయలుదేరాడు. ఆసుపత్రికి చేరుకునేలోపే ట్రాఫిక్ జామ్ అడ్డంకిగా మారింది. వాహనం నిలిచిపోవడంతో కుమారుడు దారిమధ్యలోనే సిపిఆర్ చేస్తూ తండ్రిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ ఆసుపత్రికి చేరుకునేలోపే వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. అత్యవసర సేవలు సమయానికి అందకపోవడం, ట్రాఫిక్ సమస్యలు మరో ప్రాణాన్ని బలి తీసుకున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఏఐతో ఉద్యోగాల అంతమా?

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల భారీ సంఖ్యలో ఉద్యోగాలు కనుమరుగవుతాయనే భయాలు అతిశయోక్తి కావచ్చునని అమెజాన్ సీఈవో ఆండీ జెస్సీ అభిప్రాయపడ్డారు. ఉద్యోగ అవకాశాలను పూర్తిగా తొలగించడం కంటే, పని స్వభావాన్ని ఏఐ పునర్నిర్మించే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. మీడియాతో మాట్లాడిన జెస్సీ గత రెండు మూడు దశాబ్దాలుగా మానవ శ్రమపై ఆధారపడిన అనేక పనులకు భవిష్యత్తులో తక్కువమంది అవసరమవుతారని అంగీకరించారు. అయితే దీని అర్థం ఉద్యోగాలు పూర్తిగా అంతరించిపోతాయని కాదన్నారు. ప్రతి సాంకేతిక విప్లవం వచ్చినప్పుడు కొన్ని పనులు మార్పులకు లోనవుతాయి, అదే సమయంలో కొత్త రకాల ఉపాధి అవకాశాలు పుట్టుకొస్తాయని వివరించారు. ఈ అభిప్రాయానికి మద్దతుగా పలు పరిశోధనా నివేదికలు కూడా ఇదే దిశగా సూచిస్తున్నాయి. కొన్ని పనులు ఆటోమేటైజ్ అయినప్పటికీ ఉద్యోగులు శాశ్వతంగా ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉండదని ఆర్థిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. బదులుగా, ఇంకా ఉనికిలో లేని కొత్త పాత్రలతో సహా విభిన్న రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయని అంచనా వేస్తున్నారు. గత 150 ఏళ్లలో విద్యుత్, యాంత్రీకరణ, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి సాంకేతిక మార్పులు పరిశ్రమలను పూర్తిగా మార్చినా మానవ శ్రమను పూర్తిగా భర్తీ చేయలేదని నిపుణులు గుర్తుచేస్తున్నారు. 1980లలో స్ప్రెడ్‌షీట్‌ల ప్రవేశంతో కొన్ని క్లరికల్ పనులు తగ్గినా, ఆర్థిక రంగంలో మరింత ఉన్నత స్థాయి, విలువైన ఉద్యోగాలకు దారితీసిందని ఉదాహరణగా పేర్కొంటున్నారు. సాంకేతిక మార్పులు ఉపాధిని అంతం చేయవని, దానిని కొత్త దిశగా మలుస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బాధిత కుటుంబాలకు సీఎం పరిహారం

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**

సౌదీ అరేబియా మదీనా సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పరిహారం అందించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అందుకే వారందరినీ సచివాలయానికి పిలిచి ప్రత్యక్షంగా పరామర్శించామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రమాదం జరిగినట్లు తెలుసుకున్న వెంటనే మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మదీనాకు పంపినట్లు సీఎం గుర్తుచేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు జారీ చేసి మదీనాకు పంపించినట్లు తెలిపారు. అక్కడ భారత కాన్సులేట్, సౌదీ ప్రభుత్వంతో సమన్వయం చేసి మృతుల అంత్యక్రియలను జన్నతుల్ బఖీ సమాధి స్థలంలో నిర్వహించిన విషయాన్ని వివరించారు. నవంబర్ 17, 2025న మదీనా సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున, గాయపడిన ఒకరి కుటుంబానికి మూడు లక్షల రూపాయల పరిహారం అందించారు. దేశం బయట జరిగే ప్రమాదాల్లో సాధారణంగా ప్రభుత్వాలు పరిహారం చెల్లించే విధానం లేకపోయినా, మానవతా దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు, నాంపల్లి ఎమ్మెల్యే, హజ్ కమిటీ చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మహిళా న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ అవసరం: సీతక్క

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 27:**

ప్రజాభవన్‌లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, పరిపాలనా అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని తెలిపారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, కోటి రూపాయల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా వంటి పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నామని వెల్లడించారు. విద్యా విధాన పరిషత్తు ఉద్యోగులను 010 పద్ధతి కిందికి తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా పనిచేయడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1.02 కోట్ల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను సమర్థంగా అమలు చేయడంలో ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని భట్టి విక్రమార్క సూచించారు.

# భూదాన్ ఉద్యమం రోజుకో మలుపు.

- మొదటిపేజీ తరువాయి...

బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా బాధితుల పరామర్శకు వెళ్తున్నారు. ఇంతకీ అసలేంటీ భూదాన్ భూముల వివాదం,దశాబ్దాల క్రితం ఆచార్య వినోబాభావే దేశవ్యాప్తంగా చేపట్టిన భూదాన్ ఉద్యమంతో స్ఫూర్తి పొందిన కొందరు దాతలు వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని సుమారు 31 నుంచి 60 ఎకరాల తమ భూమిని పేదలకు పంపిణీ చేయమని ప్రభుత్వానికి ఇచ్చారు. భూమి లేని నిరుపేదలకు ఒక గూడు దొరుకుతుందన్నది వారి ఆశయం. అయితే భూదాన్ బోర్డు పేరుతో స్థలం ఉన్నప్పటికీ అధికారికంగా ఎవరికీ ఈ స్థలంలో పట్టాలు కేటాయించలేదు. కాలక్రమేణా ఖమ్మం పట్టణం విస్తరించడం, నగరంలో కొత్త కలెక్టరేట్ కూడా ఈ ప్రాంతానికి అత్యంత సమీపంలోనే నిర్మాణమవడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఏళ్ల క్రితం 'దానం'గా వచ్చిన భూమి ఇప్పుడు కోట్ల రూపాయల 'బిజినెస్'గా మారిపోయింది.

10 ఏళ్లకుపైగా 'వినోబా నవోదయ కాలనీ'పేరుతో సుమారు 600 నుంచి 1,000 కుటుంబాలు అక్కడ గుడిసెలు, రేకుల ఇళ్లు వేసుకుని నివసిస్తున్నాయి. వీరికి మున్సిపల్ అధికారులు నల్లా కనెక్షన్లు ఇచ్చారు, విద్యుత్ శాఖ మీటర్లు బిగించారు. అంతేకాదు, గత ఎన్నికల సందర్భంగా ఇక్కడ ఓట్లు కోరిన రాజకీయ నాయకులు వారికి పట్టాలు ఇస్తామనే హామీలు కూడా ఇచ్చారు. కానీ భూదాన్ బోర్డు నుంచి ఈ భూమి ఎవరికీ అధికారికంగా కేటాయించలేదనీ, కొందరు దళారులు నకిలీ పత్రాలతో ఇక్కడ పేదలను చేర్పించి లక్షల రూపాయలు వసూలు చేశారని ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల వాదన.ప్రస్తుత ఉద్రిక్తతలకు రెండు ప్రధాన కారణాలు.. భూదాన్ బోర్డు ఆస్తులను రక్షించడంలో విఫలమైతే అధికారులదే బాధ్యత అని హైకోర్టు ఘాటుగా స్పందించింది. దీంతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి స్థలం స్వాధీనం చేసుకోవాలనే చర్యలు చేపట్టింది. ఇది ఒకవైపు నుంచి వినిపిస్తున్న వాదన. ఈ భూమికి కేవలం 500 మీటర్ల దూరంలోనే కొత్త కలెక్టరేట్ నిర్మాణం జరగడంతో, ఇక్కడి భూమి విలువ ఎకరాకు 10 కోట్లకుపైగా పెరిగింది. మొత్తం భూమి విలువ సుమారు రూ 250 నుంచి 300 కోట్లు కావడంతో అధికార యంత్రాంగం దీనిపై కన్నేసిందన్న విమర్శ రెండోది. ఈ వాదనలు ఇలా సాగుతున్న టైంలోనే ఈనెల 24న పెద్ద ఎత్తున ఆక్రమణల కూల్చివేత కార్యక్రమం జరిగింది. మూడు జిల్లాల నుంచి సుమారు 1,000 మందికి పైగా పోలీసుల పహారాలో, ఎస్.డి.ఆర్.ఎఫ్ (రాణ=ఖీ) బృందాల సమక్షంలో డజన్ల కొద్దీ జెసిబిలతో ఇళ్లను నేలమట్టం చేశారు. మహిళలు అడ్డుకోవడానికి ప్రయత్నించినా, కొందరు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడినా యంత్రాంగం వెనకడుగు వేయలేదు. "మా ఓట్లు తీసుకునేటప్పుడు ఈ భూమి ప్రభుత్వానిదని తెలీదా?" అని బాధితులు ప్రశ్నించారు.ఇప్పుడు పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంటోందా.. ఎన్నికలకు ముందు అన్నిపార్టీల వాళ్లూ తమకు పట్టాలిస్తామని చెప్పారు. ఇప్పుడు అధికార పార్టీ నేతలు కానీ జిల్లా నుంచే మంత్రులైన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు మొహంచాటేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కేవలం ప్రభుత్వ భూమిని కాపాడుతున్నామని కాంగ్రెస్ చెబుతోంది. భూమాఫియా నుంచి భూదాన్ భూములను విడిపించడమే లక్ష్యంగా పేర్కొంటున్నారు. తమ హయాంలో ప్రభుత్వం కనీస వసతులు కల్పించగా, రేవంత్ సర్కారు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడం అమానుషమని బీఆరెస్, వామపక్షాలు విమర్శిస్తున్నాయి. కారణాలేమైనా దశాబ్దాలుగా అక్కడ బతుకుతున్న పేదల జీవితాలు ఒక్కరోజులో రోడ్డున పడ్డాయి. ఉన్నట్టుండి నివాసాలు కూల్చేసి తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లలో వసతి కల్పించిన ప్రభుత్వం వారికి శాశ్వత ప్రత్యామ్నాయం మాత్రం చూపలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. నేటి రియల్ ఎస్టేట్ భూమ్‌లో పెరుగుతున్న భూముల ధరలకూ, సొంత గూడు కలకు మధ్య నలుగుతున్న పేదవాడికి పరిష్కారం చూపకపోతే ఈ వేడి ఖమ్మం నగరాన్ని మరింత రగిలించే అవకాశం కనిపిస్తోంది.

# లండన్ అగ్నిప్రమాదంలో మరో తెలుగు విద్యార్థి మృతి

**జనం వాయిస్, నిజామాబాద్/లండన్, ఫిబ్రవరి 28:**

లండన్‌లోని క్రొయిడాన్ ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో మరో తెలుగు విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గొంతి అభిషేక్ మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన నిజామాబాద్‌కు చెందిన సాయి శ్రీకర్‌ను వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. సాయి శ్రీకర్ తల్లిదండ్రులు అవయవ దానానికి అంగీకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిజామాబాద్‌లోని శ్రీనగర్ కాలనీకి చెందిన సాయి శ్రీకర్, గొంతి అభిషేక్ ఇద్దరూ లండన్‌లో ఒకే గదిలో నివసిస్తూ చదువులు పూర్తిచేసుకుని పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన వీరు ఉన్న నివాసంలో గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగినట్లు సమాచారం. లండన్‌లోని దుప్పాస్ హిల్స్ టెర్రాస్ ప్రాంతంలో ఉన్న రెండు అంతస్తుల భవనంలో ఈ ఘటన జరిగింది. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకు మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో ఇద్దరూ బయటపడలేకపోయినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదం నుంచి బయటపడ్డ మరో విద్యార్థి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనతో తెలుగు రాష్ట్రాల్లో విషాద వాతావరణం నెలకొంది. విదేశాల్లో ఉన్న విద్యార్థుల భద్రతపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులు ప్రమాదంపై విచారణ కొనసాగిస్తున్నారు.

# కూనోకు మరో 9 చీతాలు

**జనం వాయిస్, భోపాల్, ఫిబ్రవరి 28:**



మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్క్‌కు మరో తొమ్మిది చీతాలు చేరుకున్నాయి. దక్షిణాఫ్రికాలోని బోట్స్‌వానా నుంచి మూడు మగ, ఆరు ఆడ చీతాలను అధికారులు ప్రత్యేక విమానంలో గ్వాలియర్‌కు తరలించారు. అనంతరం వీటిని కూనో పరిధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నివాస ఎన్‌క్లోజర్లలో ఉంచి, త్వరలో అడవిలోకి విడిచిపెట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన 'ప్రాజెక్ట్ చీతా' కార్యక్రమం కింద విదేశాల నుంచి చీతాలను భారత్‌కు తీసుకొస్తోంది. మొదటగా 2022 సెప్టెంబర్‌లో నమీబియా నుంచి ఎనిమిది చీతాలు రాగా, 2023 ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాలను తరలించారు. ఇప్పుడు మూడో దశలో బోట్స్‌వానా నుంచి తొమ్మిది చీతాల రాకతో దేశంలో చీతాల మొత్తం సంఖ్య 48కి చేరింది. చీతాలను విడుదల చేసే కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి పాల్గొననున్నారు. ఈ జంతువుల ఆరోగ్యం, వాతావరణానికి అలవాటు పడే విధానంపై అధికారులు, నిపుణులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. కొన్ని చీతాలు స్థానిక పరిస్థితులకు అలవాటు పడలేక మరణించినప్పటికీ, వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కూనో నేషనల్ పార్క్ చీతాలకు అనువైన ప్రదేశంగా గుర్తించబడింది. 2023లో అక్కడ 39 చీతా కూనలు జన్మించగా, ప్రస్తుతం 27 జీవించి ఉన్నాయి. వ్యాధుల ముప్పును దృష్టిలో ఉంచుకుని కొన్ని చీతాలను గాంధీ సాగర్ అభయారణ్యానికి తరలించి సంరక్షిస్తున్నారు. దేశంలో అంతరించిపోయిన చీతాలను తిరిగి స్థిరపరిచే దిశగా కేంద్రం కృషి కొనసాగిస్తోంది.

# 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'కు శ్రీకారం

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'ను చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నాలుగు కోట్ల ప్రజల పండుగగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చించారు. దేశ అభివృద్ధి పథంలో తెలంగాణను తిరుగులేని ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని, ప్రత్యేక లోగోతో పాటు 99 రోజుల కార్యాచరణ షెడ్యూలును సిద్ధం చేయాలని సీఎస్‌కు సూచించారు. ఈ కాలంలో ఫైళ్ల క్లియరెన్స్‌తో పాటు అన్ని కార్యాలయాల్లో పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని విస్తరించాలని, ప్రజలు ఇంటి నుంచే సేవలు పొందే విధంగా సంస్కరణలు తీసుకురావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కరెంట్ మీటర్, ఇంటి అనుమతి, నల్లా కనెక్షన్ వంటి సేవలకు ప్రజలు కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా విధానాలు అమలు చేయాలని సూచించారు. ప్రతి ఫైలు స్థితి దరఖాస్తుదారుకు తెలిసేలా పారదర్శక వ్యవస్థను అమలు చేయాలని, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతను వినియోగించి మహాలక్ష్మి, రేషన్ కార్డులు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభం, ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి, మ్యానుఫాక్చరింగ్ జోన్‌ల రూపకల్పన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ఉండాలని సూచించారు. ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని సుపరిపాలనతో నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# ఎడిటోరియల్

## డిజిటల్ యుగంలో చిన్న వ్యాపారాలు నిలబడగలవా?

- సాంకేతిక విప్లవం చిన్న వ్యాపారాలకు సవాలా? అవకాశమా?.
- ఆన్‌లైన్ వాణిజ్య పోటీ స్థానిక మార్కెట్లపై ప్రభావం.
- మూలధనం, డిజిటల్ నైపుణ్య లోపం ప్రధాన అడ్డంకులా?.
- మార్పును స్వీకరించినవారికే భవిష్యత్తు.

ప్రపంచ వాణిజ్య వ్యవస్థ వేగంగా మారుతోంది. డిజిటల్ విప్లవం కొనుగోలు, విక్రయ విధానాలను పూర్తిగా మార్చేసింది. వినియోగదారులు ఇప్పుడు మొబైల్ పరికరాల ద్వారానే సరుకులు ఆర్డర్ చేస్తున్నారు. గృహ డెలివరీ, డిజిటల్ చెల్లింపులు, తక్షణ ధరల పోలికలు ఇవి సాధారణ విషయాలయ్యాయి. ఈ పరిణామాల మధ్య చిన్న వ్యాపారాలు తమ స్థానం నిలబెట్టుకోగలవా అన్న ప్రశ్న సమాజంలో గంభీరంగా వినిపిస్తోంది. ఒకప్పుడు చిన్న దుకాణాలు ప్రతి కాలనీలో విశ్వాసానికి ప్రతీకలుగా ఉండేవి. వినియోగదారులతో వ్యక్తిగత అనుబంధం, నమ్మకం, సరళమైన సేవలు వారి బలం. స్థానిక అవసరాలకు తగిన ఉత్పత్తులు అందించడం ద్వారా వారు మార్కెట్‌ను నిలబెట్టుకున్నారు. కానీ ఇప్పుడు పెద్ద డిజిటల్ వేదికలు తక్కువ ధరలు, విస్తృత ఎంపికలు, వేగవంతమైన సేవలతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఈ పోటీలో చిన్న వ్యాపారాలు వెనుకబడుతున్నాయన్న భావన పెరుగుతోంది.

మూలధనం చిన్న వ్యాపారాలకు ప్రధాన సమస్య. పెద్ద సంస్థలతో పోలిస్తే ప్రచారం, నిల్వ నిర్వహణ, సాంకేతిక వసతులు పరిమితంగా ఉంటాయి. డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ విక్రయ వేదికలు, సరఫరా శృంఖల వ్యవస్థలు ఇవి ఖర్చుతో కూడినవే. ఈ పరిస్థితి చిన్న వ్యాపారాలను ఆర్థికంగా ఒత్తిడికి గురిచేస్తోంది. డిజిటల్ నైపుణ్య లోపం మరో సవాల్. చాలా చిన్న వ్యాపారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ ప్రచారం, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి అంశాల్లో అవగాహన అవసరం. శిక్షణ లేకపోతే డిజిటల్ మార్పుకు అనుగుణంగా మారడం కష్టమవుతుంది.

అయితే డిజిటల్ యుగం పూర్తిగా ప్రతికూలం కాదు. అదే సాంకేతికతను ఉపయోగించి చిన్న వ్యాపారాలు తమ మార్కెట్‌ను విస్తరించవచ్చు. స్థానిక ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించడం, సామాజిక మాధ్యమాల ద్వారా వినియోగదారులతో అనుబంధం పెంచడం, డిజిటల్ చెల్లింపులు స్వీకరించడం వంటి మార్గాలు అందుబాటులో ఉన్నాయి. చిన్న వ్యాపారాల బలం వ్యక్తిగత సేవ, నాణ్యత, స్థానిక విశ్వాసం. ఈ అంశాలను బలంగా నిలబెట్టుకుంటే పోటీలో నిలబడగలవు. ప్రభుత్వ విధానాలు కూడా కీలకం. చిన్న వ్యాపారాలకు సులభ రుణాలు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక మద్దతు అందించాలి. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించే విధానాలు అమలు చేయాలి. చిన్న వ్యాపారాలు దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది. ఉపాధి అవకాశాల సృష్టిలో వారి పాత్ర అమూల్యం. వినియోగదారుల పాత్ర కూడా ముఖ్యమే. స్థానిక దుకాణాలను ఆదరించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. తక్కువ ధరల ఆకర్షణకంటే నాణ్యత, విశ్వాసం, స్థానిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. డిజిటల్ మార్పు అనివార్యం. మార్పును భయపడకుండా స్వీకరించడం అవసరం. చిన్న వ్యాపారాలు సాంకేతికతను శత్రువుగా కాకుండా మిత్రుడిగా చూడాలి. నూతన ఆలోచనలు, సేవల విభిన్నత, వినియోగదారులతో ప్రత్యక్ష అనుబంధం ఇవే వారి బలం. మొత్తంగా డిజిటల్ యుగం చిన్న వ్యాపారాలకు ఒక పరీక్ష. అదే సమయంలో ఒక అవకాశం కూడా. అనుకూలత, ఆవిష్కరణ, సమన్వయం ఉంటేనే నిలకడ సాధ్యం. మార్పును అంగీకరించి ముందుకు సాగినవారే భవిష్యత్తులో నిలబడగలరు. చిన్న వ్యాపారాలు సాంకేతికతతో కలిసిపోతేనే వారి ప్రస్థానం మరింత బలపడుతుంది. డిజిటల్ పరిజ్ఞానం లోపం చిన్న వ్యాపారాలకు ప్రధాన సవాల్. ఆన్‌లైన్ విక్రయ విధానాలు, డిజిటల్ మార్కెటింగ్, చెల్లింపు వ్యవస్థలు ఇవి అర్థం చేసుకోవడం, అమలు చేయడం కొందరికి కష్టంగా మారుతోంది. మూలధనం పరిమితి కూడా సమస్య. పెద్ద సంస్థలతో పోలిస్తే ప్రచారం, సాంకేతిక మద్దతు, సరఫరా వ్యవస్థల్లో చిన్న వ్యాపారాలు బలహీనంగా ఉంటాయి. అయితే డిజిటల్ యుగం పూర్తిగా ప్రతికూలమని చెప్పలేం. సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకుంటే చిన్న వ్యాపారాలకు కొత్త అవకాశాలు ఉన్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, డిజిటల్ చెల్లింపులు, స్థానిక డెలివరీ సేవలు వంటి మార్గాలు అందుబాటులో ఉన్నాయి. స్థానిక ప్రత్యేకత, నాణ్యత, వ్యక్తిగత సేవ వంటి అంశాలు చిన్న వ్యాపారాలకు బలం. ప్రభుత్వ విధానాలు కూడా కీలకం. శిక్షణ కార్యక్రమాలు, సులభ రుణాలు, డిజిటల్ మద్దతు అందిస్తే చిన్న వ్యాపారాలు మార్పుకు అనుగుణంగా మారగలవు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం, స్థానిక మార్కెట్ల బలోపేతం అవసరం. వినియోగదారులు కూడా స్థానిక వ్యాపారాలను ఆదరించాలి.

డిజిటల్ మార్పును అంగీకరించడం తప్పనిసరి. మార్పును భయపడకుండా స్వీకరించాలి. చిన్న వ్యాపారాలు సాంకేతికతను శత్రువుగా కాకుండా మిత్రుడిగా చూడాలి. నూతన ఆలోచనలు, సేవల విభిన్నత, నాణ్యతపై దృష్టి పెడితే పోటీలో నిలబడగలవు.

మొత్తంగా డిజిటల్ యుగం చిన్న వ్యాపారాలకు సవాలు మాత్రమే కాదు; అవకాశం కూడా. అనుకూలత, ఆవిష్కరణ, సమన్వయం ఉంటేనే నిలకడ సాధ్యం. మార్పు అనివార్యం. ఆ మార్పును స్వీకరించి ముందుకు సాగినవారే భవిష్యత్తును నిర్మించగలరు.

# ఇరాన్‌గల్ఫ్ ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన

**అన్ని పక్షాలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి.**
**చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం.**
**గల్ఫ్ దేశాల్లో భారతీయులకు అత్యవసర సూచనలు.**

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:**

ఇరాన్, గల్ఫ్ ప్రాంతంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పరిస్థితులు మరింత దిగజారకుండా చూడాలని భారత




విదేశాంగ శాఖ కోరింది. ముఖ్యంగా పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. సమస్యల పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలే సరైన దారి అని విదేశాంగ శాఖ అధికారిక ప్రకటనలో పేర్కొంది. అన్ని దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని భారత్ స్పష్టం చేసింది. ఉద్రిక్తతలను తగ్గించేందుకు చర్చల ద్వారా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఆ ప్రాంతాల్లో ఉన్న భారతీయులతో భారత రాయబార కార్యాలయాలు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. టెహ్రాన్, దోహా, అబుదాబి నగరాల్లోని భారత ఎంబసీలు అక్కడి భారతీయులకు అత్యవసర సూచనలు జారీ చేశాయి. అనవసర ప్రయాణాలు మానుకోవాలని, సైనిక స్థావరాలకు దూరంగా ఉండాలని, స్థానిక అధికారుల ఆదేశాలను పాటించాలని సూచించాయి. అమెరికాఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే సంబంధిత రాయబార కార్యాలయాలను వెంటనే సంప్రదించాలని హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది.

# ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థి అనుమానాస్పద మృతి

**కళాశాల గదిలో రక్తపు మడుగులో మృతదేహం.**
**తుపాకీ కాల్పులతో మృతి చెందినట్లు ప్రాథమిక అనుమానం.**
**అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు.**

**జనం వాయిస్, ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 28:**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 22 ఏళ్ల విద్యార్థి అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం సంచలనం సృష్టించింది. ఘుర్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చక్ గౌరీశంకర్ నీబి గ్రామంలో ఉన్న ప్రైవేట్ కళాశాల గదిలో సాహిల్ అనే విద్యార్థి మృతదేహం శుక్రవారం గుర్తించారు. అతడు లాల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోబ్రా తర్వార్ గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం సాహిల్ తుపాకీ కాల్పులకు గురై ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. గదిలోకి చేరుకున్న పోలీసులకు సాహిల్ కుర్చీలో కూర్చున్న స్థితిలో కనిపించాడు. అతని చేతిలో 315 బోర్ పిస్టల్ ఉండగా, అక్కడ కార్ట్రిడ్జ్‌లు కూడా లభించాయి. అతడిని అత్యంత సమీప దూరం నుంచి కాల్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటన స్థలంలో ఇయర్‌బడ్ కూడా లభించడంతో కాల్పులకు ముందు ఎవరితోనైనా మాట్లాడి ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. సమాచారం అందుకున్న వెంటనే ఏసీపీ కౌంధియారా అబ్దుల్ సలాం ఖాన్ ఫోరెన్సిక్ బృందంతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. గదిలోని ఆధారాలను సేకరించి



మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ప్రాథమికంగా ఇది ఆత్మహత్యగా కనిపిస్తున్నప్పటికీ, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడు సాహిల్ తండ్రి రేవతి రామన్ శుక్లా వ్యవసాయం చేస్తున్న రైతు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విద్యార్థి మరణానికి గల కారణాలను వెలికితీసేందుకు కాల్ డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు.

# ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు ముదురుతున్నాయి



**జనం వాయిస్, దుబాయ్/టెహ్రాన్, ఫిబ్రవరి 28:**

ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ నసిర్జాదే మరణించినట్లు అంతర్జాతీయ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామంతో ప్రాంతీయ పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారాయి. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి దాడులకు దిగినట్లు సమాచారం. దుబాయ్, అబుదాబి, ఖతార్, రియాద్ ప్రాంతాల్లోని లక్ష్యాలపై దాడులు జరిగినట్లు స్థానిక వర్గాలు వెల్లడించాయి. దుబాయ్‌లోని నివాస ప్రాంతాలపై దాడుల్లో ఒకరు మరణించినట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనమైన బుర్జ్ ఖలీఫాను ముందస్తు జాగ్రత్తగా ఖాళీ చేయించారు. అక్కడ నివసిస్తున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రాంతీయ భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు

**వైమానిక దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి మృతి.**
**గల్ఫ్ దేశాలపై క్షిపణి దాడులు.**
**శాంతి చర్చలకు పిలుపునిస్తున్న యూరప్ దేశాలు.**

శాంతి చర్చలు అవసరమని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు పిలుపునిచ్చాయి. ఇరు పక్షాలు తక్షణమే దాడులు నిలిపివేసి చర్చలకు రావాలని విజ్ఞప్తి చేశాయి. ఇదే సమయంలో అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ ప్రయోగించిన ఒక క్షిపణిని కూల్చివేసినట్లు అమెరికా రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. పరిస్థితి మరింత విషమించకుండా అంతర్జాతీయ సమాజం కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తోంది.

# ఇరాన్‌పై దాడుల ప్రభావంతో ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం

- మధ్యప్రాచ్యానికి అన్ని విమాన సర్వీసులను నిలిపివేసిన ఎయిర్ ఇండియా.
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో పెరిగిన తీవ్ర ఉద్రిక్తతలు.
- పశ్చిమ దేశాలకు వెళ్లే విమానాలను రద్దు చేసిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్.

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:**

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో, అంతర్జాతీయ విమానయాన సేవలపై భారీ ప్రభావం చూపుతోంది. ఇరాన్‌పై మరికొన్ని దేశాల ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో ఎయిర్ ఇండియా మరియు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రయాణికుల భద్రతను అగ్రాధారంగా




తీసుకుంటూ, మధ్యప్రాచ్యంలోని అన్ని గమ్య స్థలాలకు పరుగులు చేసేందుకు ఉండే విమాన సర్వీసులను తక్షణమే లి నిలిపివేయడం లి నిర్ణయించారు. ఎయిర్ ఇండియా తన అధికారిక ప్రకటనలో తెలిపింది, “మధ్యప్రాచ్య ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారినందున మా ప్రయాణికులు, సిబ్బంది భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. అందుకే అన్ని గమ్యస్థానాలపై ఉన్న విమానాలను నిలిపివేస్తున్నాం. భద్రతా పరిస్థితిని నిరంతరం పరిశీలించి, అవసరమైతే మా ఆపరేషన్లను సర్దుబాటు చేస్తాం.” సంస్థ ప్రయాణికులకు అన్ని విధాలా సహాయమిస్తుందని హామీ ఇచ్చింది. విమాన సేవలు నిలిపివేయడంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కూడా ముందెత్తినట్లు తెలిపింది. గల్ఫ్ దేశాల్లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పశ్చిమాన అన్న దేశాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలను రద్దు చేసినట్లు సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఈ నిర్ణయం పెద్ద సంఖ్యలో ప్రయాణించే ప్రయాణికులకు, ప్రత్యేకంగా మధ్యప్రాచ్యంతో సంబంధిత టికెట్‌లు ఉన్నవారికి ప్రభావం చూపుతోంది. ప్రయాణికులు తమ విమానాల స్టేటస్ తెలుసుకోవాలంటే ఆన్‌లైన్‌లో లేదా 24 గంటల కాల్ సెంటర్ ద్వారా తెలుసుకోవచ్చు: 91 1169329333, 91 1169329999 రద్దైన ప్రయాణాల, టికెట్ మార్పుల వివరాలను ఎయిర్ ఇండియా వెబ్‌సైట్‌లోని ‘మేనేజ్ బుకింగ్’ విభాగంలో పొందవచ్చు. పరిస్థితి ఇంకా తీవ్రమైతే యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రతకు చేరే ప్రమాదం ఉందని విశ్లేషకులు చెప్పడం, ఈ నేపథ్యంలో విమాన సేవల నిలిపివేత ముందుచూపుగా తీసుకున్న చర్యని భావిస్తున్నారు.

# నేను మున్సిపల్ కార్మిక కుటుంబం నుండి వచ్చిన వాడినే

- మీ సమస్య ఏదైనా నేను తీరుస్తా.
- కార్మికులతో మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ సమావేశం.

**జనం వాయిస్, జమ్మికుంట:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో శనివారం రోజున పారిశుధ్య కార్మికులతో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్ ) సమావేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపల్ అనేది నా కుటుంబం.నేను మున్సిపల్ కార్మిక కుటుంబం



నుండి వచ్చిన వాడిని మీ యొక్క బాధలు సమస్యలు తెలిసిన వాడిని నేను మీయొక్క కొడుకులా,అన్నలా, తమ్ముడిలా భావించి మీకు ఎలాంటి సమస్యలు ఉన్న నాకు చెప్పవచ్చు అని సమస్య ఏదైనా పరిష్కరిస్తానని,వారికి హామీ ఇచ్చారు. పట్టణాన్ని అద్దంలా మెరిపించాలని ప్రజలు ఇబ్బందులు పడకుండా వాడవాడలను పరిశుభ్రంగా ఉంచాలని మీరు మీయొక్క విధి నిర్వహణ సక్రమంగా నిర్వర్తిస్తూ జమ్మికుంట పట్టణాన్ని శుభ్రపరుస్తున్న మీ ఆరోగ్యం విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలని గ్లౌజ్ మాస్క్ ధరించాలని వారికి సూచించారు. అదేవిధంగా నూతన కౌన్సిలర్స్ తో పట్టణ ప్రజలందరికీ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తెలిపారు.

# ఘనంగా టైలర్స్ డే వేడుకలు

- గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్.



**జనం వాయిస్, జమ్మికుంట**

టైలర్స్ డే సందర్భంగా జమ్మికుంట పట్టణంలో ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం నిర్వహించారు. జమ్మికుంట పట్టణ టైలర్స్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేడుకలకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి టైలర్లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో టైలర్ల వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, ప్రతి ఇంటి అవసరాల్లో వారి సేవలు కీలకమని కొనియాడారు. టైలర్ల సంక్షేమం కోసం మున్సిపాలిటీ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కనుమ శ్రీనివాస్, అలాగే మహేశ్వర్, మల్లికార్జున్, శ్రీహరి, సజ్జు తదితరులు పాల్గొన్నారు.టైలర్స్ డే సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఐక్యతను చాటిన ఈకార్యక్రమం విజయవంతం కావడంతో టైలర్స్ అసోసియేషన్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# వార్డు అభివృద్ధి వైపు ఒగ్గు చూపు

## - అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్న 28వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు రమేష్.

**జనం వాయిస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని 28వ వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. వార్డులోని ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన కౌన్సిలర్ ఒగ్గు రమేష్ డ్రైనేజీ మోరీ పనుల్లో స్వయంగా పాల్గొని ప్రజల అభినందనలు అందుకుంటున్నారు.వార్డులో చాలా కాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించేవి. ఈ నేపథ్యంలో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిగణలోకి తీసుకుని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను ప్రారంభించారు. పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అన్నది ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.ప్రజల మధ్యే ఉండి వారి సమస్యలను తెలుసుకుంటూ, పరిష్కార దిశగా ముందుకు సాగుతున్న ఆయన విధానాన్ని స్థానికులు ప్రశంసిస్తున్నారు. “మా వార్డు అభివృద్ధి కోసం కౌన్సిలర్ దగ్గరుండి కృషి చేయడం ఎంతో సంతోషకరం. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలి” అని వార్డు ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.వార్డు అభివృద్ధి, ప్రజా సేవే తన ధ్యేయమని, ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యం ముందుకు సాగుతున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి 28వ వార్డును



ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు.

# హనుమాన్ ఆలయ అభివృద్ధికి చైర్మన్ హామీ

**జనం వాయిస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి హనుమాన్ జంక్షన్ ను ఆధ్యాత్మిక భక్తి చిహ్నాలతో తీర్చి దిద్దుతామని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగూరి ప్రశాంత్ కుమార్ ( దిలీప్) అన్నారు. కరీంనగర్ జిల్లాలోని అపర భద్రాద్రిగా పేర్కొన్న ఇల్లందకుంట లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయానికి అభిముఖంగా ఉన్న హనుమాన్ జంక్షన్ సుందరంగా తీర్చిదిద్దుతామని చైర్మన్ అన్నారు.శనివారం రోజున కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేసిన అనంతరం ఆలయం ముందు నిర్మిస్తున్న హనుమాన్ జంక్షన్ లో హనుమాన్ గధ మరియు శంకు చక్ర నామాలు ఏర్పాటు చేస్తామని ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బొద్దుల రవీందర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ పలువురు కౌన్సిలర్ల విజ్ఞప్తి మేరకు నిర్ణయం తీసుకున్నారు. శ్రీ భక్తాంజనేయ స్వామి దర్శనానికి విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ దిలీప్ వైస్ చైర్మన్ జావేద్, కౌన్సిలర్లు పోలినేని అజయ్ రావు, బత్తుల లక్ష్మణ్, గుర్రం కావ్య పరుశురాం, పోలినేని శిల్ప వేణు రావు లను ఆలయ అర్చకులు చందర్రావు ఆశీర్వచనాలు అందజేయగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దుల రవీందర్ స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యం కొరకు అహర్నిశలు కృషి చేస్తున్న వైద్యులపై దాడి హేయనీయమైన చర్య

- హుజురాబాద్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ తిరుపతి.

**జనం వాయిస్, జమ్మికుంట:**

హైదరాబాదులోని రెండు ఆసుపత్రులలో రోగి మృతికి కారణం వైద్యులు అంటూ వారి బంధువులు ఆసుపత్రి సిబ్బందితోపాటు ఆసుపత్రిలో ఉన్న సామాగ్రిని ధ్వంసం చేయడం జరిగింది. దీనికి నిరసనగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట హుజరాబాద్ ఐఎంఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్క డాక్టరు తన శక్తి వంచన లేకుండా కృషి చేయడం జరుగుతుందని దురదూశావశాత్తు చికిత్స జరుగుతున్న సమయంలో రోగి ప్రాణాలు కాపాడలేక పోయినందుకు డాక్టర్లు శతవిధాలుగా బాధపడడం జరుగుతుందని వారి మృతికి వైద్యులే కారణమంటూ బంధువులు ఆసుపత్రి సిబ్బందిపై




ఆసుపత్రులపై దాడి చేయడం సరైన చర్య కాదని అన్నారు. వైద్యం అందించడంలో ప్రతి ఒక్క డాక్టరు కృషి చేయడం జరుగుతుందని పొరపాటున జరిగే మరణాలవల్ల వైద్యులే కారణమంటూ దూషిస్తూ దాడులు చేయడం సరైన చర్య కాదని ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని వైద్యం చేస్తున్న డాక్టర్లను కాపాడవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నిరసనలో వైద్యులు డాక్టర్ ముక్క రాజేశ్వరయ్య, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ రాణి, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ దేవేందర్ రెడ్డి, ఉడుగుల సురేష్ ,డాక్టర్ కిషోర్, ఆకుల శ్రీనివాస్ , సురేష్, శరత్ ,ప్రణీత తో పాటు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ గడ్డపై బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అవడం ఖాయం

- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వివాదాలకు దూరంగా,అభివృద్ధికి దగ్గరగా నిధులు మంజూరు.
- హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్.

జనం వాయిస్, హుజురాబాద్:

కొన్ని రోజులుగా కౌశిక్ రెడ్డి వివిధ చానెల్ లో ఇచ్చిన ఇంటర్వ్యూలు చూస్తుంటే అతనికి మతి స్థిమితం పూర్తిగా కోల్పోయినట్టు మెదడు మోకాలిలోకి వచ్చి,వ్యక్తిగత ఇమేజ్ కోసం అధికారులను దూషించడం,ఆపై తన మాటే నెగ్గాలి అన్నట్టుగా ప్రవర్తిస్తున్నాడని కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణల్లో ఒక్కటి కూడా నిజం లేదని,అవన్నీ బోగస్ ముచ్చట్లనీ అన్నారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.శనివారం నాడు హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 98 మంది లబ్ధిదారులకు 36 లక్షల విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను 5 మండలాల పరిధిలోని లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాట్లాడితే కేసులు పెడుతున్నారని అనే కౌశిక్ రెడ్డి తన కేసుల విషయంలో ప్రజల కోసం కొట్లాడితేనో,ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటేనో కేసులు పెట్టలేదని,వ్యాపారస్తులను,ఇక్కడున్న ఇసుక క్వారీల యజమానులను,ప్రతి ఒక్కరిని బెదిరించి అక్రమాలకు పాల్పడితే వారే స్వచ్ఛందంగా పోలీసు స్టేషన్ కి వెళ్లి కేసులు




పెట్టారని అన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి,సంక్షేమం సమపాళ్లుగా ప్రజలకు అందిస్తున్నామని,ప్రజా ప్రభుత్వంలో హుజురాబాద్ లో ఏ ఎన్నిక జరిగినా ప్రజల తీర్పు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉందని,ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయగా దాన్ని జీర్ణించుకోలేని కౌశిక్ రెడ్డి ఆగం ఆగం అవుతున్నారని అన్నారు.ఇకపై హుజురాబాద్ లో బిఆర్ఎస్ పార్టీ ఉండదని భూస్థాపితమయ్యిందని అన్నారు.

**ముఖ్యమంత్రిపై అనవసరపు వ్యాఖ్యలు చేస్తే సహించం..**

పెద్దవారితో పోల్చుకుంటే పెద్దోడైపోతామని కౌశిక్ రెడ్డి పగటి కలలుకంటున్నాడని,ఎన్నికలైన,ఇతర విషయాల్లో దూరి అనవసరపు ఇష్యూలో కలగచేసుకొని తన పరువు పోగొట్టుకోవడమే కాదు హుజురాబాద్ పరువు కూడా తీస్తున్నాడని కౌశిక్ రెడ్డిపై మండిపడ్డారు ప్రణవ్. ముఖ్యమంత్రిపై ఇంకోసారి చిల్లర వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.కేసీఆర్ బయటికి వస్తే ఏదో అయిపొద్దని చెప్పే కౌశిక్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దెబ్బకు ఫార్మ్ హౌస్ కే పరిమితం అయ్యారని ,కేసీఆర్ బయటికి వచ్చిన ఎంపీ ఎన్నికల్లో ప్రజలు గుండు సున్నా ఇచ్చి మళ్ళీ ఫామ్ హౌస్ కే పరిమితం చేశారని గుర్తుచేశారు.పదేళ్లు రాష్ట్రాన్ని చిన్నా బిన్నం చేసి మళ్ళీ అధికారం కోసం వాళ్ళు మాట్లాడే మాటలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

**పోలీసుల విషయంలో కౌశిక్ రెడ్డి తన ప్రవర్తన మానుకోవాలి..**

ఇటీవల వీణవంక సమ్మక్క సారలక్క జాతర విషయంలో పోలీసులపై కౌశిక్ రెడ్డి చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని చట్ట ప్రకారం హైకోర్టు ఆదేశాల మేరకు వారు నడుచుకున్నారని,కౌశిక్ రెడ్డి చెప్పినట్టు వినడానికి,నడవడానికి ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదని,ప్రజా ప్రభుత్వమని అన్నారు.ఒక మహిళ అధికారిని పట్ల ఇష్టం వచ్చినట్టు



మాట్లాడడం సోషల్ మీడియాలో ట్రోల్ చేయడంపై అతని సంస్కారానికే వదిలేస్తున్నామని అన్నారు.మళ్ళీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పోలీసులకు ట్రైనింగ్ ఇస్తా అనడం కాదు ముందుగా మీ కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావు ఎవరితో ఎలా మాట్లాడాలో నేర్పలేదాఅని ఈ విషయంలో కౌశిక్ రెడ్డి ట్రైనింగ్ తీసుకోవాలని సూచించారు.

**మతం పేరుతో కరీంనగర్ సీపీనీ దూషించింది నిజం కాదా?ఈ విషయంపై కేటీఆర్,హరీష్ రావు బీఆర్ఎస్ స్టాండ్ ఏంటో చెప్పాలి.**

కౌశిక్ రెడ్డి ఒక ముస్లిం అధికారినీ పట్టుకొని కులం పేరుతో దూషించింది నిజం కాదా అని,ఈ విషయంపై కేటీఆర్ హరీష్ రావు బీఆర్ఎస్ పార్టీ స్టాండ్ ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు ప్రణవ్.బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కేటీఆర్,హరీష్ రావు మద్దతు ఇస్తున్నారా అని ప్రశ్నించారు?తక్షణమే హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద కౌశిక్ రెడ్డి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని,వైస్ చైర్మన్ అంజలి,కౌన్సిలర్లు,మార్కెట్ చైర్మెన్ లు,దేవాలయ చైర్మెన్ లు,డైరెక్టర్లు,మండల,పట్టణ అధ్యక్షులు,సీనియర్ నాయకులు,యువజన విభాగం నాయకులు,బ్లాక్ కాంగ్రెస్,మైనారిటీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

www.janamvoice.com
epaper.janamvoice.com
దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# కోరపల్లి పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**జనం వాయిస్, జమ్మికుంట:**

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జమ్మికుంట మండలం లోని కోరపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం రోజున సైన్స్ మేలాను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగాపాఠశాలప్రధానోపాధ్యాయులు కె. శ్రీ నివాస్ రెడ్డి అధ్యక్షతన సివి రామన్ చిత్ర పటానికి పూలమాల అలంకరించి అందరు ఉపాధ్యాయులు పూలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఇట్టి జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమానికి కోరపల్లి ప్రాథమిక పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు గుడిమిల్ల బలరాం ముఖ్య అతిథిగా, న్యాయ నిర్ణనేతగా విచ్చేసి విద్యార్థులు తయారు చేసినటువంటి ఎగ్జిబిట్లను పరిశీలించి అందులో నుండి నాలుగు ఉత్తమ ఎగ్జిబిట్లను ఎంపిక చేశారు. ప్రాథనోపాధ్యులు, ఉపాధ్యాయులు సైన్స్ ఉపాధ్యాయులను మరియు విద్యార్థులను అభి నందించారు. అనంతరం ఉత్తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించినవిద్యార్థులకుబహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమములో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజయ్య,ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పెండెం శ్రీనివాస్, బయలాజికల్ సైన్స్ఉపాధ్యాయులు రవి కాంత్ రాజు గైడ్ టీచర్లుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.



# కేంద్ర బడ్జెట్ ను సవరించాలి.

## వై. యాకయ్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు.

**జనం వాయిస్, మంథని:**

మంథని ఫ్రెండ్స్ క్లబ్ హాల్లో సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టాలు తప్పిన బడ్జెట్ బండి – ప్రజలపై భారాలు అనే అంశంపై సదస్సు జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.యాకయ్య ప్రముఖ న్యాయవాది కే రగోతంరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంద రాజేందర్ బూడిద గణేష్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వై యాకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక కర్షక వ్యతిరేక బడ్జెట్ అని కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అని అన్నారు వ్యవసాయ రంగానికి అరకొర నిధులు కేటాయించారని విద్య వైద్యానికి మొండిచేయి చూపారని కార్మిక కర్షకులకు తీవ్రమైన అన్యాయం చేశారని విమర్శించారు గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి జిరాంజి పథకాన్ని తీసుకువచ్చారని ఈ పథకానికి రెండు లక్షల 50 వేల కోట్లు కేటాయించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తే ఆ దిశగా నిధులు కేటాయించకుండా ఉపాధి




హామీలో రెండు పూటల ఫోటో యాప్ తో పాటు అనేక షరతులు విధించి ఉపాధి హామీని పేదవానికి అందకుండ చేస్తుందని విమర్శించారు ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి మార్చి నెల మాసంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ప్రజలను కలుస్తూ జిరాంజి పథకం రద్దుకై ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్మికులకు కష్టజీవులకు పేద ప్రజలకు వ్యతిరేకమైన కేంద్ర బడ్జెట్ను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వేప చెట్టు రాజన్న, ఆర్ల సందీ, గొర్రెంకల సురేష్ ,బెజ్జంకి డిగంబర్ ననుబోతుల సత్యం కార్మిక రైతులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణ లకు ప్రభుత్వ ప్రోత్సాహం.

## - రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.

- గ్రామీణ ప్రాంతాలలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు చర్యలు.
- ప్రజలకు సాంకేతికత చేరువ చేయడం ద్వారా ట్రిలియన్ డాలర్ ఎకనామి గా తెలంగాణ ఎదుగుతుంది.
- మంథని లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ ఎక్స్ పో 2026 కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు.

**జనం వాయిస్, మంథని, ఫిబ్రవరి-28:**

నూతన ఆవిష్కరణ లకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు. శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి మంథని బస్ డిపో ఎదురుగా టీ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్ ఎక్స్ పో



2026 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, డ్రీమ్, రైస్, స్టార్ట్ నినాదంతో ఇన్నోవేషన్ ఎక్స్ పో 2026 ను మంథని లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మంథని లో ఉన్న టీ- వర్క్స్ యూనిట్ బృందం కలెక్టర్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటిస్తూ విద్యార్థులు నూతన ఆవిష్కరణ పట్ల ఆసక్తి పెంపొందించే దిశగా కృషి చేశారని అన్నారు. నూతన ఆవిష్కరణలు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం



టీ-వర్క్స్ యూనిట్ ను 7 నెలల క్రితం మంథని లో ప్రారంభించామని, ఇక్కడ పిల్లలు అనేక నూతన ఆవిష్కరణలు తయారు చేసేందుకు ఉత్సాహంగా ముందుకు వచ్చారని తెలిపారు. జిల్లాలో ముందస్తుగా 20 ప్రభుత్వ పాఠశాలల్లో ఏ.ఐ. ఆధారిత బోధన, కృత్రిమ మేధస్సు పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించిన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మంథని లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏ.ఐ. వాడకం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించడంతో రాబోయే విద్యా సంవత్సరం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఏ.ఐ. బోధకం జరిగేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ



జరుగుతుందని అన్నారు. టైర్ 2, టైర్ 3 , రూరల్ ప్రాంతాలకు కూడా ఐటీ, ఏఐ ఆధారిత రంగాలు విస్తరించడం వల్ల 2034 నాటికి తెలంగాణ ను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూచించిన విధంగా పిల్లలు మంచి కలలు కని, వాటిని సాధించేందుకు కార్యాచరణ ప్రారంభించాలని మంత్రి సూచించారు. పిల్లల ఆలోచనలను పదును పెట్టేందుకు డ్రీమ్, స్టార్ట్, రైస్ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. మంథని లోని యువకులు నూతనంగా తయారు చేసిన వ్యవసాయ పవర్ ఫిడర్, ఆధునిక హెల్మెట్ తయారి వంటి అనేక ఆవిష్కరణలు చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు మంథని లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో డ్రీమ్, స్టార్ట్, రైస్ సంస్థ పని చేస్తుందని ని అన్నారు.

పాఠశాలలో ఇన్నోవేషన్ ప్రోత్సహించే దిశగా ఎంఓయూ చేసుకునేందుకు ముందుకు వచ్చిన ఔత్సాహిక వేత్తలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఉన్న రోజు వారి సమస్యల పరిష్కారానికి మన ఆవిష్కరణలు ఉపయోగపడాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ వర్క్స్ సి.ఈ.ఓ.జోగేందర్ , మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, ఆర్.డి.ఓ. సురేష్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ...

# ఉద్యోగ బాధ్యతలో శంకర్ సేవలు అభినందనీయం



**జనం వాయిస్, మంథని, ఫిబ్రవరి 28:**

ఉద్యోగ బాధ్యతలో మోసం శంకర్ సేవలు అభినందనీయమని మంథని బస్ డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్ కొనియాడారు. శనివారం మంథని బస్ డిపోలో శ్రామిక్ గా విశిష్టమైన సేవలు అందించిన మోసం శంకర్ పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. మోసం శంకర్ 34 సంవత్సరాల ఉద్యోగ బాధ్యతలలో అలుపు లేకుండా సేవలందించారని గుర్తు చేశారు. ఆయన బాధ్యతల్లో క్రమశిక్షణ, అంకితభావంతో పాటుగా అందరిలో కలివిడిగా ఉంటూ, ఆప్యాయతను పంచారని తెలిపారు. శంకర్ డిపోలో శ్రామిక్ గా పనిచేస్తూనే తన వంతు సహాయంగా సమాజ అభివృద్ధికి తోడ్పాటు చేశారని పేర్కొన్నారు. మంచికి మారుపేరుగా నిలిచిన శంకర్ తన ఉద్యోగ ధర్మాన్ని ఏనాడు మర్చిపోలేదని తెలిపారు. పదవికి మాత్రమే విరమణ సేవకు కాదని, పదవి విరమణ అనంతరం తన శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఆయనకు, వారి కుటుంబానికి ఆ భగవంతుడు నిండు నూరేళ్లు, అష్టైశ్వర్యాలతో తులతూగేల ఆశీర్వదించాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో సిటిఐ ఏంజెల్, గ్యారేజ్ ఇన్చార్జి ఇక్బాల్, సూపర్డెంట్ జ్యోతి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు అంకరి కుమార్, సామాజిక సేవా కార్యకర్త లోడి మల్లేశం, డిపో నాయకులు వెంగళ దాసు ఐలయ్య, గంగపుత్ర సంఘం నాయకులు గంధం రాజేందర్, అంకరి ప్రకాష్, గంధం శంకర్, గంధం వెంకటస్వామి, దొంగరి ప్రకాష్, అంకరి శివ, బిజెపి సీనియర్ నాయకులు బోయిని నారాయణ లతో పాటు అధిక సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



# 19 మంది పోలీసు అధికారులకు ఘన వీడ్కోలు

- పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానించిన సీపీ వి.సి. సజ్జనార్.
- ఆరోగ్యంగా, చురుకుగా శేష జీవితం గడపాలని సూచన.
- ఆర్థిక లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**

హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందుతున్న 19 మంది పోలీసు అధికారులకు నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ ఘనంగా వీడ్కోలు పలికారు. వీరిలో నలుగురు ఉపనిరీక్షకులు, పది మంది సహాయ ఉపనిరీక్షకులు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు ఇతర సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో సీపీ మాట్లాడుతూ, పదవీ విరమణ పొందుతున్న అధికారులందరికీ తన తరఫున, నగర పోలీసు విభాగం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఫుట్ పెట్రోలింగ్ నుంచి ఆధునిక వాహనాలతో గస్తీ వరకు మారుతున్న కాలానికి అనుగుణంగా వారు అందించిన



సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు నిబద్ధతతో పనిచేసిన అనుభవజ్ఞులైన అధికారులు పోలీసు శాఖకు అమూల్యమైన సేవలు అందించారని పేర్కొన్నారు. పదవీ విరమణ ఒక కొత్త ఆరంభమని, శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని సీపీ సూచించారు. నిత్యం ఏదో ఒక వ్యాపకంతో చురుకుగా ఉండాలని, శారీరకమానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. రిటైర్మెంట్ ప్రయోజనాల రూపంలో వచ్చే నగదును ప్రభుత్వ బ్యాంకులు లేదా తపాలా కార్యాలయాల్లో భద్రపరచుకోవాలని సజ్జనార్ తెలిపారు. అధిక లాభాల ఆశ చూపే మోసగాళ్ల పట్ల, ముఖ్యంగా సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కుటుంబ సభ్యులు కూడా విశ్రాంత అధికారులకు మానసికంగా అండగా నిలవాలని కోరారు.

# శారదా పీఠం భూముల నిర్ణయంపై హర్షం: హరీశ్ రావు

- జలమండలి కేటాయింపు రద్దు ధర్మ విజయమని వ్యాఖ్య.
- 17 ఎకరాల భూమి కేటాయింపుపై ప్రశ్నలు.
- ప్రజాప్రయోజనాల కోసం పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక.



**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**

కోకాపేటలోని శారదా పీఠంకు కేటాయించిన భూములను తిరిగి పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంపై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం శుభపరిణామమని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమ వేదికగా స్పందించిన ఆయన, ఇది భక్తుల విజయమని అభిప్రాయపడ్డారు. శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించిన నిర్ణయాన్ని రద్దు చేయడం రాజశ్యామలాదేవి అమ్మవారి కృపతో జరిగిన ధర్మ విజయమని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి సరైన నిర్ణయం తీసుకోవడం స్వాగతార్హమని తెలిపారు. అదే సమయంలో, హెచ్ఎండీఏ ద్వారా నామినేషన్ పద్ధతిలో 17 ఎకరాల భూమి కేటాయింపుపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. స్పష్టమైన ప్రజాప్రయోజన ఆధారం లేకుండా పర్యావరణ నియమ నిబంధనలకు విరుద్ధంగా భూములు కేటాయించారని ఆరోపించారు. ఆ భూమిలో కొనసాగుతున్న క్రషర్ యూనిట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకునే ప్రభుత్వ నిర్ణయాలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హరీశ్ రావు హెచ్చరించారు. అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు.

# బల్కంపేట ఆలయంలో మల్టీ లెవల్ పార్కింగ్‌కు గ్రీన్ సిగ్నల్

- టెండర్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశాలు.
- పనులు వెంటనే ప్రారంభించాలి: మంత్రి కొండా సురేఖ.
- భక్తులకు సౌకర్యాల మెరుగుదల లక్ష్యం.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**



బల్కంపేట ఆలయ పరిసరాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేసి పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పార్కింగ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం పార్కింగ్ సదుపాయాల కొరత కారణంగా భక్తులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన వాహన నిలుపుదల వసతి కల్పించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని చెప్పారు. టెండర్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం జరగకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని, పనులు ప్రారంభమైన తర్వాత నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యం, ఆలయ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రాజెక్టును వేగవంతం చేయాలని సూచించారు.

# డిజిటల్ రూపాంతరణతో సుస్థిర పాలన వైపు తెలంగాణ

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**

భారతదేశంలోని ప్రఖ్యాత ఈ-పాలన సదస్సు 'టెక్నాలజీ సభ 2026' 39వ సంచికను హైదరాబాద్‌లో ప్రారంభించిన సందర్భంగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, కృత్రిమ మేధస్సు, డేటా వేదికలు ప్రభుత్వ పరిపాలనను విస్తృత స్థాయిలో మారుస్తున్నాయని పేర్కొన్నారు. దేశ స్థూల దేశీయోత్పత్తిలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ 11.7 శాతం వాటాను కలిగి ఉందని మంత్రి తెలిపారు. పారదర్శకత, సమర్థత, పౌర కేంద్రిత విధానాల నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. డిజిటల్ వేదికల ద్వారా సేవల సరళీకరణ, వేగవంతమైన నిర్ణయ ప్రక్రియ, సమగ్ర డేటా వినియోగం వంటి అంశాలు




పాలనను మరింత ప్రజలకు చేరువ చేస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో కృత్రిమ మేధస్సు రంగం, డేటా కేంద్రాలు, ఆవిష్కరణ వాతావరణం, అర్ధవాహక పరిశ్రమలకు అనుసంధానిత రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సాంకేతికత ఆధారిత అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. టెక్నాలజీ సభ 2026 సదస్సు డిజిటల్ రూపాంతరణ వేగవంతానికి, పాలనలో ఉత్తమ పద్ధతుల సంస్థీకరణకు వేదికగా నిలిచిందని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.

**ఈ-పాలనలో కృత్రిమ మేధస్సు, డేటా వేదికల ప్రాధాన్యం.**
**స్థూల దేశీయోత్పత్తిలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వాటా 11.7 శాతం.**
**పారదర్శక, పౌర కేంద్రిత పాలన లక్ష్యంగా ముందడుగు.**
**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.**

# హైదరాబాద్‌ను కుప్పకూల్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే: కేటీఆర్

- రెండు ఏళ్లలో అన్ని రంగాల్లో రాజధానికి దెబ్బ.
- అవినీతి, రియల్ ఎస్టేట్ రాజకీయాలే కారణమని ఆరోపణ.
- నగర సమస్యలపై పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరాన్ని రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో అధోగతికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెట్టివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. నగర ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం తన ఆర్థిక ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలకే ప్రాధాన్యత ఇస్తూ పరిపాలన సాగుతోందని ఆరోపించారు. హైదరాబాద్ పార్టీ నేతలతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధానిలో పారిశుధ్యం నుంచి ప్రజా రవాణా వరకు అన్ని రంగాల్లో పరిస్థితి దిగజారిందని కేటీఆర్ అన్నారు. దోమల నివారణలో వైఫల్యం, కరెంట్ కోతలు, తాగునీటి ఇబ్బందులు, చెత్త నిర్వహణ లోపాలు నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతి, వ్యాపార వాణిజ్యాలు క్షీణించాయని, నగర ఆర్థిక వ్యవస్థ బలహీనపడిందని విమర్శించారు. తన స్వప్రయోజనాల కోసం 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేర్లతో కొత్త ప్రాజెక్టులను ప్రోత్సహిస్తూ ఉన్న హైదరాబాద్ నగరాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా నుంచి టీడీఆర్ వరకు పలు భూమి కుంభకోణాలు జరిగాయని, కుటుంబ సభ్యులు, అనుచరుల ప్రయోజనాల కోసం వేల కోట్ల రూపాయల భూముల వ్యవహారాలు నడుస్తున్నాయని అన్నారు. ప్రజలు ఓట్లు వేయలేదన్న కక్షతోనే నగరంపై ప్రతీకార ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో పది సంవత్సరాల పాటు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మెట్రో



నగరంగా తీర్చిదిద్దామని కేటీఆర్ గుర్తు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం, మెరుగైన పారిశుధ్యం, ప్రజా రవాణా వంటి అంశాల్లో నగరాన్ని ముందుకు తీసుకెళ్లామని పేర్కొన్నారు. అదే విశ్వాసంతో ప్రజలు రెండు సార్లు మేయర్ పీఠాన్ని తమ పార్టీకి అప్పగించారని అన్నారు. సమీక్షా సమావేశంలో అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన నగర సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా పార్టీ కార్యకలాపాల సమన్వయానికి వివిధ బాధ్యతలను నేతలకు అప్పగించినట్లు వెల్లడించారు. నగర ప్రజల ఆకాంక్షలను పరిరక్షించేందుకు, ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు అన్ని విధాలా పోరాటం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

**జనం వాయిస్, సికింద్రాబాద్, ఫిబ్రవరి 28:**

సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ మరియు పరికరాల పంపిణీ" కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులకు టూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు పలు చర్యలు చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత, మహిళలు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లకుండా, స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. కుట్టుపని, హస్తకళలు, ఇతర గ్రామీణ పరిశ్రమలకు అవసరమైన ఆధునిక యంత్రాలు, పనిముట్లు ఉచితంగా అందించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



# కోకాపేటలో శారదా పీఠానికి భూముల కొనసాగింపు

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**

హైదరాబాద్ కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూమిని పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఠానికి కేటాయించిన భూములను జల మండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులపై పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాల తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. భూములను జల మండలికి కేటాయించే సమయంలో అక్కడ ఇప్పటికే కొనసాగుతున్న నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జల మండలికి చేసిన కేటాయింపులను రద్దు చేసి, భూములను శారదా పీఠానికే కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే నిర్మాణాలు, ఇతర పరిస్థితులపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వివరించాలని పీఠం ప్రతినిధులకు సూచించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.





## వెలుగుమట్ల భూదాన్ భూములపై ఘర్షణాత్మక పరిణామాలు

**ఇళ్ల కూల్చివేతపై ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం.**
**పేదలపై దౌర్జన్యమా..? ప్రభుత్వంపై మండిపాటు.**
**బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండ.**

**జనం వాయిస్, ఖమ్మం, ఫిబ్రవరి 28:**

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇళ్ల కూల్చివేత ఘటనపై రాజకీయ వేడి మరింత పెరిగింది. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంఘటన స్థలానికి చేరుకుని కూల్చివేసిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం బాధితులను పరామర్శించి వారి ఆవేదనను తెలుసుకున్నారు. అధికారులు, పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని, తమ ఇళ్లలోని వంట సామాను సైతం తీసుకెళ్లారని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. కొందరు బాధితులు ఆయన కాళ్లపై పడి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. భూదాన్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు విల్లాలు నిర్మించుకుని నివసిస్తున్నారని, కానీ పేదల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని కూల్చివేశారని బాధితులు ప్రశ్నించారు. తమపై అమలు చేసిన నిబంధనలు వారికి వర్తించవా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సిసిఎల్ఏ ఆదేశాల పేరుతో యుద్ధభూమిని తలపించేలా ఇళ్లను కూల్చివేయడం మానవత్వ రాహిత్యమని పేర్కొన్నారు. చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులను కూడా చూడకుండా డోజర్లతో ఇళ్లను తొక్కించారని, ఇది సభ్య సమాజం తలదించుకునే చర్య అని అన్నారు. కోర్టులు ఎక్కడా ఇళ్లను కూల్చమని చెప్పలేదని, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించాయని తెలిపారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదని విమర్శించారు. వెలుగుమట్ల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని, కానీ ఇప్పుడు వారి ఆశలు నెరవేరలేదని ఈటల పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం, రెవెన్యూ మంత్రి, వ్యవసాయ మంత్రి వంటి సీనియర్ మంత్రులు ఉన్నా ప్రజల బాధలు తీరలేదని అన్నారు. బాధితుల సమస్యలను ప్రపంచానికి తెలియజేయాలనే ఉద్దేశంతో వచ్చిన జర్నలిస్టులపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. భూదాన్ భూములు పేదలకు ఇళ్లు, సాగు కోసం దానం చేసినవని, ఇవి ప్రభుత్వానికి జాగీర్ కాదని స్పష్టం చేశారు. పెద్దలు ఆక్రమించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. కూల్చివేసిన ప్రదేశంలోనే యుద్ధప్రాతిపదికన ఇళ్లు నిర్మించాలన్నారు. బాధితులు కోల్పోయిన సామాన్లకు కూడా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అంబేద్కర్ భవనంలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు బీజేపీ తరఫున భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పూర్తిగా అండగా ఉంటుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి.**
**- రెండు రాష్ట్రాల ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు.**
**- ఆలయ అధికారులకు కృతజ్ఞతలు.**

**జనం వాయిస్, విజయవాడ, ఫిబ్రవరి 28:**

విజయవాడలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. దర్శనం అనంతరం ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయానికి



విచ్చేసిన భక్తులతో ఆత్మీయంగా ముచ్చటించడం సంతోషంగా అనిపించిందని పేర్కొన్నారు. దర్శన సమయంలో ఆలయ అర్చకులు, అధికారులు, పాలక మండలి సభ్యులు అందించిన సత్కారానికి మంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ పరంపరలు, భక్తుల విశ్వాసాన్ని కాపాడాలని ఆకాంక్షించారు.

## వైఎస్ విజయమ్మ, వైఎస్ షర్మిలను ఆహ్వానించిన భట్టి విక్రమార్క

**- కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి ఆహ్వానం.**
**- వచ్చే నెల 5న హైదరాబాద్‌లో వేడుక.**
**- మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రిక అందజేత.**

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి శ్రీమతి విజయమ్మను, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే నెల 5వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. భేటీ సందర్భంగా భట్టి విక్రమార్క వివాహ ఆహ్వాన పత్రికను వారికి అందజేశారు. కుటుంబ వేడుకకు హాజరై తమ ఆశీస్సులు అందించాలని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంలో పరస్పర శుభాకాంక్షలు కూడా తెలియజేసుకున్నారు. హైదరాబాద్‌లో జరగనున్న ఈ వివాహ వేడుకకు పలువురు రాజకీయ ప్రముఖులు, సన్నిహితులు హాజరుకానున్నట్లు సమాచారం. కుమారుడి వివాహాన్ని సాదాసీదాగా, కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిసింది.



## వెలుగుమట్ల భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ అండ

**కేటీఆర్ పిలుపుతో అంబేద్కర్ భవనంలో సహాయక చర్యలు**
**బాధితులకు భోజనం, మంచినీటి సదుపాయం**
**న్యాయం జరిగేంతవరకు సాయం: ఎంపీ రవిచంద్ర**

**జనం వాయిస్, ఖమ్మం, ఫిబ్రవరి 28:**

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ కొండంత అండగా నిలిచింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఖమ్మంలోని అంబేద్కర్ భవనంలో బాధితుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం తక్షణ సహాయం అందించకపోవడంతో పార్టీ తరఫున సహాయక చర్యలు చేపట్టినట్లు నేతలు తెలిపారు. బాధితులకు భోజనాలు, మంచినీటి సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితుల పరిస్థితిని సమీక్షించి, వారి ఆవేదనలను తెలుసుకున్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగేంతవరకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



## కాంగ్రెస్‌పై హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు



**- కోకాపేట్‌లో శారద పీఠం వద్ద ఉద్రిక్తత.**
**- ప్రభుత్వ భూమి కేటాయింపులపై ప్రశ్నలు.**
**- ఆలయ పరిరక్షణ కోసం ఆందోళన హెచ్చరిక.**

జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను కూడా కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డెప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్ ప్రాంతంలోని విశాఖ శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారనే సమాచారం అందడంతో హరీశ్ రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారశైలి ఉందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కోకాపేట్ సర్వే నంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా, క్యాబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల భూమి కేటాయించామని తెలిపారు. పీఠం నిర్వాహకులు ప్రభుత్వానికి రూ.1 కోటి 5 లక్షలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, హెచ్ఎండీఏకు రూ.23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్లు పొందినట్లు వివరించారు. ఆలయంలో రాజశ్యామల అమ్మవారి ప్రతిష్ఠా కార్యక్రమం హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల సమక్షంలో జరిగిందని, అప్పటి నుంచి నిత్య పూజలు కొనసాగుతున్నాయని తెలిపారు. వాటర్ వర్క్స్ నిర్మాణం పేరుతో ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించిన హరీశ్ రావు, అదే ప్రాంతంలో 17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పుడు ఆలయ స్థలాన్నే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రశ్నించారు. ఆ భూమిని రేవంత్ రెడ్డి తన బంధువులకు అక్రమంగా కేటాయించారని, సమాచారం హక్కు చట్టం కింద పొందిన సమాధానాల్లో ఇది వెల్లడైందని ఆరోపించారు. ఓపెన్ వేలం వేస్తే ప్రభుత్వానికి వందల కోట్ల ఆదాయం వచ్చేదని, కానీ నామినేషన్ పద్ధతిలో కేటాయింపులు జరిగాయని అన్నారు. అర్ధరాత్రి సమయంలో పెద్ద ఎత్తున పోలీసులు వచ్చి పీఠాధిపతులను, నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేయడం అనైతికమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా చర్యలు చేపట్టడాన్ని ఖండించారు. దేవాలయ పూజలను అడ్డుకోవడం భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. క్యాబినెట్‌లో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకువచ్చి ఆలయాన్ని కూల్చకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే ఈ దేవాలయ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడుకోవడం తమ బాధ్యత అని, రాజశ్యామల ఆలయాన్ని కూల్చనివ్వబోమని హరీశ్ రావు స్పష్టం చేశారు.



# సినిమా

# కాల్‌షీట్ దొరికితే సగం విజయం



ఎంత పెద్ద హీరో సినిమా అయినా, ఎంత ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ అయినా పాత్ర నచ్చకపోతే నిర్మొహమాటంగా తిరస్కరించే ధైర్యం ఉన్న కథానాయికగా సాయిపల్లవి ప్రత్యేక గుర్తింపు పొందింది. కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇస్తూ తనదైన మార్గంలో ముందుకు సాగుతున్న ఆమె నిర్ణయాలపై మొదట్లో అనేక విమర్శలు వచ్చాయి. ఇలాంటి వైఖరి కథానాయికలకు సరికాదని, అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే ఆ అంచనాలన్నింటినీ తారుమారు చేస్తూ సాయిపల్లవి వరుస విజయాలతో తన స్థాయిని మరింత బలపరుచుకుంది.

నటనలో సహజత్వం, పాత్రలో లీనమయ్యే తీరు ఆమె ప్రత్యేకత. వాణిజ్య అంశాలకంటే కథలోని భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చే చిత్రాలను మాత్రమే ఎంచుకుంటూ ప్రేక్షకుల్లో విశ్వాసం సంపాదించింది. అందుకే ఆమె సినిమాలు విడుదలకు ముందే ఒక ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి. ప్రస్తుతం తమిళంలో రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రంలో ధనుష్కు జోడీగా నటిస్తోంది. అలాగే ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతితో కలిసి ఓ చిత్రంలో నటిస్తోంది. ఇక హిందీ చిత్రరంగంలో కూడా సాయిపల్లవి తన ప్రస్థానాన్ని విస్తరిస్తోంది. 'ఏక్ దిన్' చిత్రంతో పాటు, పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న రామాయణ చిత్రంలో మహాసాధ్వి సీత పాత్రలో కనిపించబోతోంది. ఈ పాత్రపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సీతగా ఆమె ఎంపిక కావడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

సాయిపల్లవి కాల్‌షీట్ దొరికితే సినిమా సగం విజయం సాధించినట్టేనని నిర్మాతలు భావిస్తున్నారనే మాట పరిశ్రమలో వినిపిస్తోంది. పాత్రల ఎంపికలో రాజీపడని ధోరణి, సహజ నటన, ప్రేక్షకులతో ఏర్పడిన అనుబంధం ఆమెను ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయి. విమర్శలను పట్టించుకోకుండా తనకు నచ్చిన మార్గంలో ముందుకు సాగుతున్న సాయిపల్లవి కెరీర్ ప్రస్తుతం అప్రతిహతంగా దూసుకుపోతోంది.

# 'వెంకటప్పయ్య నాయుడు'గా కలెక్షన్ కింగ్..

## - 'శ్రీనివాస మంగపురం' నుంచి ఫస్ట్ లుక్ విడుదల

కలెక్షన్ కింగ్ డాక్టర్ మోహన్ బాబు మరోసారి వెండితెరపై తన గంభీరమైన నటనతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీనివాస మంగపురం పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో మోహన్ బాబు పోషిస్తున్న "వెంకటప్పయ్య నాయుడు" పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేయగా, అది అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. పోస్టర్‌లో మోహన్ బాబు రాజసంతో, గంభీరమైన వ్యక్తిత్వంతో కనిపిస్తూ పాత్ర బలం ఏమిటో తెలియజేస్తున్నారు. గర్వం, ధైర్యం, ప్రభావం కలగలిసిన నాయకుడి పాత్రలో ఆయన కనిపించబోతున్నారని చిత్ర యూనిట్ వెల్లడించింది. గతంలో మహాసముద్రం, మంగళవారం వంటి విభిన్న కథాచిత్రాలతో తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న అజయ్ భూపతి, ఈసారి మోహన్ బాబును మరింత శక్తివంతమైన కోణంలో చూపించనున్నారని సమాచారం. ఈ చిత్రంతో జయకృష్ణ ఘట్టమనేని వెండితెరకు పరిచయం కానుండటం విశేషం. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడైన ఆయన తొలి చిత్రంగానే ఈ భారీ ప్రాజెక్ట్ ఎంచుకోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కథానాయికగా బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాశా థడాని నటిస్తుండటం చిత్రానికి మరింత ఆకర్షణగా మారింది. ప్రముఖ నిర్మాతలు అశ్వినీదత్, జెమిని కిరణ్ ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్నారు. కథా పరంగా భావోద్వేగాలు, శక్తివంతమైన పాత్రల మధ్య ఘర్షణలు, గ్రామీణ నేపథ్యంలోని రాజకీయ అంశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి 'వెంకటప్పయ్య నాయుడు'గా మోహన్ బాబు ఫస్ట్ లుక్ విడుదలతోనే చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అనుభవం గల నటుడు, ప్రత్యేక శైలికి పేరుగాంచిన దర్శకుడు కలయికలో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి. అభిమానులు అయితే అధికారిక విడుదల తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 'ధురంధర్ 2' రన్ టైమ్ వైరల్



బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ ధురంధర్: ది రివేంజ్ విడుదలకు సిద్ధమవుతోంది. అయితే ప్రస్తుతం ఈ సినిమా రన్ టైమ్ వివరాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి యూ/ఏ 16 ప్లస్ సర్టిఫికేట్ జారీ చేసినట్లు సమాచారం. అలాగే ఈ సినిమా నిడివి మొత్తం 220 నిమిషాలుగా ఉన్నట్లు తెలుస్తోంది. అంటే దాదాపు 3 గంటల 40 నిమిషాల సుదీర్ఘ రన్ టైమ్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగంతో పోలిస్తే ఇది మరింత ఎక్కువ నిడివి కలిగి ఉండటం విశేషం. ప్రస్తుత కాలంలో అత్యంత సుదీర్ఘ నిడివి కలిగిన చిత్రాల జాబితాలో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. కథ విషయానికి వస్తే, మొదటి భాగంలో గ్యాంగ్‌స్టర్ రెహ్మాన్ డకైట్‌ను అంతం చేసిన తర్వాత హమ్జా అలీ మజారీ పాత్రలో రణవీర్ సింగ్ తన తదుపరి లక్ష్యమైన ఐఎస్ఐ వ్యూహకర్త బడే సాబ్ అలియాస్ మేజర్ ఇక్బాల్‌ను ఎలా ఎదుర్కొంటాడు అనే ఉత్కంఠభరిత అంశాలతో ఈ సీక్వెల్ కొనసాగుతుంది. రణవీర్ సింగ్‌తో పాటు ఈ చిత్రంలో సంజయ్ దత్, ఆర్ మాధవన్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సారా అర్జున్ కథానాయికగా కనిపించనుంది. భారీ స్థాయిలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్టైనర్ మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అదే రోజున కన్నడ స్టార్ యష్ నటిస్తున్న టాక్సిక్ కూడా విడుదలవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఈ రెండు భారీ చిత్రాల మధ్య గట్టి పోటీ నెలకొననుంది. ప్రేక్షకులు ఏ సినిమాకు ఎక్కువగా మద్దతు ఇస్తారో చూడాలి.

# శ్రీవిష్ణు 'మృత్యుంజయ' ట్రైలర్ వచ్చేసింది..

టాలీవుడ్ వెర్సటైల్ నటుడు శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ జంటగా నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ మృత్యుంజయ ట్రైలర్ తాజాగా విడుదలై సినీప్రియుల్లో భారీ అంచనాలను రేకెత్తిస్తోంది. ఈ ట్రైలర్‌ను 'మ్యాన్ ఆఫ్ మాసెస్'గా పేరుగాంచిన జూనియర్ ఎన్టీఆర్ డిజిటల్ వేదికగా విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్ విడుదలతోనే చిత్రంపై చర్చలు ఊపందుకున్నాయి. సుకుమార్ శిష్యుడు శ్రీ హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శ్రీవిష్ణు ఒక భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. క్రైమ్ బ్యూరోలో ఉద్యోగం పొందలేకపోయినా, తన తెలివితేటలు, పరిశోధన నైపుణ్యాలతో క్లిష్టమైన మిస్టరీని ఛేదించే ఇన్వెస్టిగేటివ్ అధికారి పాత్రలో ఆయన పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ట్రైలర్‌లో చూపించిన సస్పెన్స్ ఎలిమెంట్స్, వేగవంతమైన కట్‌లు, గంభీరమైన నేపథ్య సంగీతం కథపై ఆసక్తిని మరింత పెంచాయి. ఒక సాధారణ వ్యక్తి ఎలా అసాధారణ కేసును ఛేదిస్తాడన్న అంశం ఈ చిత్రానికి ప్రధాన బలం కానుందనే సంకేతాలు ట్రైలర్‌లో కనిపిస్తున్నాయి. గతంలో సామజవరగమన వంటి విజయవంతమైన చిత్రంతో ప్రేక్షకులను అలరించిన శ్రీవిష్ణు రెబా మోనికా జాన్ జంట మరోసారి కలిసి నటించడం ఈ సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. ఇద్దరి మధ్య సన్నివేశాలు, భావోద్వేగ క్షణాలు ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. సస్పెన్స్, భావోద్వేగం, యాక్షన్ మేళవింపుతో కథ నడవబోతుందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ చిత్రానికి కాళ భైరవ సంగీతం అందించగా, ప్రముఖ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ తన కత్తిరింపు నైపుణ్యంతో సినిమాకు మరింత ఉత్కంఠను జోడించినట్లు తెలుస్తోంది. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం సాంకేతికంగా కూడా ఉన్నత ప్రమాణాలతో రూపొందినట్లు చిత్రబృందం చెబుతోంది. ఇప్పటికే 'విష్ణు విన్యాసం' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న శ్రీవిష్ణు, తక్కువ వ్యవధిలోనే మరో కొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రావడం విశేషం. మార్చి 6న విడుదలకు సిద్ధమవుతున్న 'మృత్యుంజయ' సస్పెన్స్ థ్రిల్లర్ ప్రేమికులకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ట్రైలర్‌కు వస్తున్న స్పందనను చూస్తే విడుదల రోజున థియేటర్లలో మంచి స్పందన లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తానికి ఎన్టీఆర్ చేతుల మీదుగా లాంచ్ అయిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచిందనే చెప్పాలి.




# బాలయ్యవివేక్ ఆత్రేయ కాంబో హాట్ టాపిక్.. భారీ ప్రాజెక్ట్‌పై చర్చలు

గాడ్ ఆఫ్ మాసెస్‌గా అభిమానుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం వరుస విజయాలతో టాలీవుడ్‌లో దూసుకుపోతున్నారు. గత కొన్నేళ్లుగా ఆయన నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడంతో బాలయ్య మార్కెట్ మరింత బలపడింది. మాస్ ఇమేజ్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తూ నిర్మాతల ఫస్ట్ ఛాయిస్‌గా మారారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణకు సంబంధించిన మరో ఆసక్తికర ప్రాజెక్ట్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. యువ దర్శకుడు వివేక్ ఆత్రేయతో బాలయ్య సినిమా దాదాపు ఖరారైనట్లు ప్రచారం వినిపిస్తోంది. విభిన్నమైన కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయ, ఈసారి బాలయ్య మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా భారీ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. కథ వ్యాప్తి చాలా పెద్దదిగా ఉండటంతో దీనిని ఒకే భాగంగా తీసుకురావాలా, లేక రెండు భాగాలుగా రూపొందించాలా అన్న అంశంపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ప్రకటన వెలువడకపోయినా, ప్రాజెక్ట్ స్థాయి మాత్రం భారీగా ఉండబోతుందనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఇదిలా ఉండగా, బాలకృష్ణ ఇప్పటికే దర్శకుడు గోపిచంద్ మలినేనితో మరో చిత్రం చేస్తున్నారు. మొదట ఈ కథ పీరియాడికల్ నేపథ్యంతో మహారాజు పాత్రలో బాలయ్య కనిపించనున్నారని వార్తలు వచ్చినప్పటికీ, బడ్జెట్ పరిమితుల కారణంగా కథలో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో బాలయ్య ముంబై బ్యాక్‌డ్రాప్‌లో మాఫియా డాన్ పాత్రలో కనిపించనున్నారని ప్రచారం సాగుతోంది. ఈ ప్రాజెక్ట్ మార్చి 5న ప్రారంభం కానుండగా, దసరా సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ యోచిస్తున్నట్లు సమాచారం. మలినేని స్టైల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుందని చెబుతున్నారు. మరోవైపు, బాలయ్యవివేక్ ఆత్రేయ కాంబినేషన్ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మించనున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మాస్ హీరో బాలయ్యను సాఫ్ట్, భావోద్వేగ కథలకు పేరుగాంచిన వివేక్ ఆత్రేయ ఎలా కొత్త కోణంలో చూపిస్తారో అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. వివేక్ ఆత్రేయ ఇప్పటికే బ్రోచేవారెవరురా, అంటే సుందరానికి వంటి చిత్రాలతో తన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. క్లీన్ కామెడీ, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చే కథన శైలితో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాంటి దర్శకుడు ఇప్పుడు బాలయ్య మాస్ ఇమేజ్‌ను ఎలా మలుస్తారో చూడాలని సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇక గతంలో వివేక్ ఆత్రేయ సూపర్ స్టార్ రజనీకాంత్కు ఒక కథ వినిపించారనే ప్రచారం కూడా వినిపించినప్పటికీ, దానిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. మొత్తానికి బాలయ్యవివేక్ ఆత్రేయ కలయిక నిజమైతే, ఇది బాలకృష్ణ కెరీర్‌లో వినూత్నమైన, విభిన్నమైన ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. అధికారిక ప్రకటన కోసం ఇండస్ట్రీతో పాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# బ్రేకప్‌పై ప్రియా భవాని శంకర్ స్పందన

తెలుగు, తమిళ చిత్రపరిశ్రమల్లో తన అందం, అభినయంతో గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ప్రియా భవాని శంకర్ తాజాగా తన వ్యక్తిగత జీవితంపై ఓపెన్ అయ్యింది. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో కాలేజీ రోజుల్లో జరిగిన ప్రేమ, బ్రేకప్ గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. హీరోయిన్లు తమ వ్యక్తిగత విషయాలను ధైర్యంగా పంచుకుంటున్న ఈ కాలంలో ప్రియా భవాని శంకర్ కూడా తన అనుభవాన్ని స్పష్టంగా వెల్లడించింది. మొదట న్యూస్ రీడర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, 2014లో టెలివిజన్ సీరియల్స్ ద్వారా నటనలోకి అడుగుపెట్టింది. అనంతరం 2017లో విడుదలైన మేయాద మాన్ సినిమాతో తమిళ చిత్రరంగంలోకి ప్రవేశించింది. తెలుగులో కళ్యాణం కమనీయం చిత్రంతో పరిచయమై ప్రేక్షకులను మెప్పించింది. ప్రస్తుతం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో



వరుస అవకాశాలతో బిజీగా కొనసాగుతోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కాలేజీ సమయంలో ఒక యువకుడిని ప్రేమించానని, అయితే అతనికి విధేయత లేకపోవడం వల్ల ఆ బంధాన్ని ముగించాల్సి వచ్చిందని తెలిపింది. అతడు పలువురు అమ్మాయిలతో సన్నిహితంగా ఉండటం తనకు నచ్చలేదని, అలాంటి బంధంలో ఎక్కువకాలం కొనసాగడం సరికాదని స్పష్టం చేసింది. ఆరోగ్యకరమైన సంబంధం అంటే పరస్పర నమ్మకం, గౌరవం అవసరమని ఆమె పేర్కొంది. విషపూరితమైన బంధాలను ధైర్యంగా ముగించుకొని ముందుకు సాగాలని యువతకు సూచించింది. ప్రస్తుతం ఆమె తన స్నేహితుడు రాజ్ వెల్‌తో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వ్యక్తిగత జీవితం పట్ల సమతుల్య దృక్పథంతో పాటు, కెరీర్ విషయంలో కూడా జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. గ్లామర్ పాత్రలకంటే కథా ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తోంది. ఇటీవల ఆమె నటించిన ఇండియన్ 2, డిమాంటీ కాలనీ 2 వంటి చిత్రాలు మంచి చర్చకు దారి తీశాయి. మొత్తానికి, తన వ్యక్తిగత అనుభవాన్ని ధైర్యంగా పంచుకున్న ప్రియా భవాని శంకర్ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com